క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

క్రోసూరు: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ ఎం.బసవరాజు శుక్రవారం తెలిపారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ పనుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



పెదకూరపాడు: ప్రతి పేదవాడు ఉన్నత చదువులు కోవాలనే ఉద్దేశ్యంలో వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు మాగులూరి ఫౌండేషన్ అధినేత మాగులూరి భానుప్రకాష్ అన్నారు. 75 త్యాళ్లూరు గ్రామంలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న లక్ష్మీ తిరుపతమ్మకు ఆయన శుక్రవారం ల్యాప్ ట్యాప్ అందించారు. మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎంపిక

క్రోసూరు: ఎమ్మార్పీఎస్ మండల కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ప్రతినిధులు తెలిపారు. మండలాధ్యక్షుడిగా కొడవాటి కృపారావు మాదిగ, అదేవిధంగా ఎంఎస్పీ మండలాధ్యక్షుడిగా జడ సుబ్బు మాదిగను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ పల్నాడు జిల్లా అధ్యక్షులు అద్దంకి బాబు మాదిగ, కనుమూరి కోటేశ్వరావు మాదిగ పాల్గొన్నారు. క్రోసూరు టౌన్ అధ్యక్షుడిగా చిల్కా రవిని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నందిగం దేవదాసు మాదిగ, మండల ఉపాధ్యక్షుడు జీవన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు రేపు ప్రభుదాసు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ



సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన మహిళ అనిత లారెన్స్ రేగో పుట్టిన రోజు సందర్భంగా.. పట్టణంలోని సాధన అనాథ వృద్ధుల ఆశ్రమం లో శుక్రవారం అన్న సంతర్పణ చేసి రగ్గులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, హృదయ రాజు, ఫౌండేషన్ సభ్యులు సురేష్ సోమశేఖర్, వృద్ధాశ్రమం నిర్వాహకుడు సురేష్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. కోటప్పకొండ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 18 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వెంకటరెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు: కారును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ప్రమాదంలో కారులోని వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన 16వ నంబర్ జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రేపల్లెకు చెందిన సుఖవాసి భానుప్రకాష్, సాంబశివరావు, హేమకుమార్, విజయవాడకు చెందిన శ్రీనాథ్ బంధువులు. అందరూ కారులో విజయవాడ నుంచి తిమ్మాపురంలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. కారు యడ్లపాడు ఎస్ఎస్ఎల్ నూలుమిల్లు వద్దకు రాగానే కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కారు వెనుక భాగంలో కూర్చున్న భానుప్రకాష్, హేమకుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా భానుప్రకాష్ (43) మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, కుమార్తె ఉన్నారు. డ్రైవర్ శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

22 నుంచి ఉచిత యోగా శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న సోమవారం నుంచి 174వ ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు కూనిశెట్టి వెంకటజనార్దన్ గురూజీ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు నెల రోజుల పాటు యోగా శిక్షణ ఉంటుందన్నారు.

అంబేడ్కర్ స్మృతి వనం.. మహత్తర కార్యం

విజయవాడ స్వరాజ్య మైదానానికి పల్నాడు ప్రజానీకం



సత్తెనపల్లి నుంచి తరలుతున్న నాయకులు, మహిళలు

సత్తెనపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల భారీ విగ్రహం, స్మృతి వనంను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొనేందుకు కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా పల్నాడు ప్రజానీకం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పట్టణం, గ్రామం నుంచి తండోప తండాలుగా జనం కదలడంతో ఎటు చూసినా పండగ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో యువత జై జగన్.. జైజై జగన్ అంటూ నినదిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయాన్ని మేధావులు, అన్ని వర్గాల ప్రజలు సంతోషిస్తూ హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారు.

నకరికల్లు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణకు మండలం నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు ఉన్నారు.

క్రోసూరు: స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి సుమారు 350 మంది శుక్రవారం తరలివెళ్లారు. ముందుగా క్రోసూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి గార్లపాటిదాసు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, వెలదిఅప్పారావు, చిల్కారవి, జీవరత్నం, ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి, చావల శ్రీనివాసరావు, చిన్నోడు తదితరులున్నారు.

పెదకూరపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణకు మండలం నుంచి వందలాది దళిత నాయకులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు విజయవాడ తరలివెళ్లారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలివెళ్తున్న కార్యకర్తలు



బెల్లంకొండ నుంచి బయలుదేరిన నాయకులు

ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపాటి యోహాను, మాల మహానాడు నాయకులు ప్రభుదాస్ తదితరులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

బెల్లంకొండ: విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యాక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.



క్రోసూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి



పెదకూరపాడు: తరలిన దళిత నాయకులు, వైఎస్సార్ సీపీ నేతలు

బెల్లంకొండలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్‌పాషా, మండల జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి, భద్రయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గొప్ప నాయకుడు అంబేడ్కర్



ప్రపంచ మేధావి, గొప్ప నాయకుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించటం చాలా మంచి నిర్ణయం. అట్టడుగు వర్గాల కోసం, జాతి ఔన్నత్యం కోసం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్. అలాంటి నాయకుడి విగ్రహం ఆవిష్కరించటం అభినందనీయం.

–బత్తిన శ్రీనివాస్ బాబు, న్యాయవాది, సత్తెనపల్లి

అంబేడ్కర్‌కు సరైన గౌరవం



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో సరైన గౌరవం దక్కింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మృతి వనం, 206 అడుగుల భారీ విగ్రహం ఏర్పాటు ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఇది దేశానికే తలమానికంగా నిలుస్తోంది.

–బంకా వాసుబాబు, ఉపాధ్యాయుడు, సత్తెనపల్లి

ఇక నియోజకవర్గ స్థాయిలో 'ఆడుదాం'



క్రోసూరు: నియోజకవర్గ స్థాయికి ఎంపికైన బయ్యవరం కబడ్డీ జట్టు



అమరావతి: కబడ్డీలో తలపడుతున్న జూపూడి, నరుకుళ్ళపాడు క్రీడాకారులు

క్రోసూరు: మండలం పరిధిలో నిర్వహించిన ఆడుదాం – ఆంధ్రా ఆటల పోటీల్లో శుక్రవారం నాలుగు క్రీడలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి జట్లు ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ బి.మహేష్ తెలిపారు. పురుషుల విభాగంలో కబడ్డీ(బయ్యవరం), బ్యాడ్మింటన్(క్రోసూరు–2), వాలీబాల్ (88త్యాళ్లూరు), ఖోఖో (అనంతవరం) జట్లు, మహిళల విభాగంలో బ్యాడ్మింటన్ (క్రోసూరు 2), కబడ్డీ(బయ్యవరం), ఖోఖో (88త్యాళ్లూరు), వాలీబాల్(88 త్యాళ్లూరు) జట్లు ఎంపికైనట్లు తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల నుంచి మొత్తం 150 జట్లు పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయి క్రికెట్, ఖోఖో క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు అచ్చంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగనున్నట్లు తెలిపారు.

తుది దశకు మండస్థాయి క్రీడలు

అమరావతి: స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ క్రీడా మైదానం, ధరణికోట గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం తుది దశకు చేరుకున్నాయి. వాలీబాల్‌లో నెమలికల్లు, షటిల్ బాడ్మింటన్‌లో అమరావతి–1, మహిళల ఖో–ఖోలో ధరణికోట–2 జట్లు మండల స్థాయిలో విజయం సాధించి, నియోజకవర్గ స్థాయి క్రీడలకు అర్హత సాధించాయి. జూపూడి, నరుకుళ్ళపాడు జట్ల మధ్య కబడ్డీ ఫైనల్ ఉత్కంఠగా సాగింది. విజేత జూపూడి జట్టు ఆటగాళ్లను ఎంపీపీ మేకల హనుమంతరావు అభినందించారు. ఇక క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉందని ఎంపీడీఓ గంగాధార శ్రీనివాస్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాటిబండ్ల అమృతవేణి, విజయ్ కుమార్, మేకల శివశంకర్, పీడీలు, సచివాలయ సిబ్బంది క్రీడలను తిలకించారు.

పోటాపోటీగా వాలీబాల్, కబడ్డీ

అచ్చంపేట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వాలీబాల్, కబడ్డీ మ్యాచ్‌లు జరిగాయి. తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి మ్యాచ్‌లను ప్రారంభించారు. వాలీబాల్‌లో వేల్పూరు, కోగంటివారిపాలెం, కొత్తపల్లి, కస్తల, అచ్చంపేట1, తాళ్లచెరువు,



కోనూరు–మాదిపాడు జట్ల మధ్య కబడ్డీ



రాజుపాలెం కబడ్డీ టీమ్‌కు షీల్డ్, మెడల్స్ అందజేత

కోనూరు జట్లు తమ ప్రత్యర్థులపై విజయం సాధించాయి. కబడ్డీలో.. మాదిపాడు, చల్లగరిగ, అచ్చంపేట–1, పెదపాలెం, కొండూరు జట్లు మ్యాచ్‌లు గెలుచుకున్నాయి.

బహుమతుల ప్రదానం

రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులను ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి ప్రదానం చేశారు. రాజుపాలెం కబడ్డీ, అనుపాలెం క్రికెట్, గణపవరం వాలీబాల్, పెదనెమలిపురి ఖోఖో జట్లు మండల స్థాయిలో గెలుపొందాయి. ఈ ఐదు జట్లు నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించినట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. టీమ్‌లకు జీడీసీ ఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, అనుపాలెం సర్పంచ్ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, సరిమెళ్ల వెంకటరెడ్డి, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రిన్సిపల్ ఇన్నారెడ్డి సంయుక్తంగా షీల్డ్, మెడల్స్, టీ షర్టులను అందించారు. మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సునీత శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం మండలాధ్యక్షుడిగా జగన్



బెల్లంకొండ: మండల కాపు సంఘం అధ్యక్షుడిగా గంగిరెడ్డిపాలెం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆసుల జగన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గంగిరెడ్డిపాలెంలో మండల కాపు నాయకుల సమావేశం నిర్వహించారు. కాపుల సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గత పదేళ్లగా మండల కాపు సంఘం అధ్యక్షుడిగా పనిచేశానని, తిరిగి మళ్లీ తనను ఎన్నుకున్న మండల కాపు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, కాపులందరూ కలిసి నడవాలని కోరారు. కాపునాడు జాతీయ అధ్యక్షుడు గల్లా సుబ్రహ్మణ్యం, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీవీ సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



దుర్గి: పేద ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యమందించటమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేకాధికారి కె.సంజీవరావు, తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మవరం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి గంగారపు వెంకటరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ధర్మవరం, శ్యామరాజపురం గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ శివకుమార్, డాక్టర్ సతీష్, ఏపీఓ వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల స్పెషలిస్టు వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామోదయంతో సమస్యల పరిష్కారం

పశర్లపాడు(రెంటచింతల): గ్రామాల్లో నెలకున్న సమస్యల పరిష్కరానికి గ్రామోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కట్టేకోట పుల్లారావు అన్నారు. పశర్లపాడు గ్రామంలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న గ్రామాభివృద్ధి పనులను సహకరించి, సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాలనీలలో మంచినీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బీకే, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ హసాన్, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, వైస్సార్ సీపీ మండలాధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

వారంలోపు రైతుల ఖాతాల్లో నగదు జమ

- ఆర్బీకేల ద్వారా కంది కొనుగోలు
- ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు



బూడిదరంగు తెగులు సోకిన పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ

నకరికల్లు: రైతు భరోసా కేంద్రాల్లో క్వింటా కంది రూ.9,232కు కొనుగోలు చేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో కందిసాగు చేస్తున్న రైతులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. కంది పంటలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఆర్బీకేల్లో కంది కొనుగోళ్ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదు చేసుకున్న పంటలు మాత్రమే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. కందులు అమ్మిన రైతు ఖాతాలో వారంలో నగదు జమ చేస్తామని తెలిపారు. గోనె సంచులు, హమాలీ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించి, రైతులకు అదనపు భారం లేకుండా చూస్తుందని వెల్లడించారు. మినుము పంటలో బూడిద రంగు తెగులు నివారణకు మందులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

చాగంటివారిపాలెంలో జాతీయ సేవా పథకం వైద్య శిబిరం



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ప్రతి విద్యార్థి స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక అధికారి డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. చాగంటివారిపాలెంలో గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులతో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎంజేఎం రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సంఘ సేవపై ఆసక్తి చూపాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు కేంద్ర పథకాలు, స్వచ్ఛభారత్ తదితర అంశాలపై శిబిరాల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రతినిధి డాక్టర్ శర్వాణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో నాయకత్వపు లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐ పవన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ శైలజ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



బ్రోచర్ అందిస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): పలుదేవర్లపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 301 మందికి వైద్య సేవలందించినట్లు ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తెలిపారు. 53 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారని, వారిలో 34 మందికి అవసరమైన కళ్ళజోళ్లు అందించటం జరుగుతుందని తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణులు శ్రావ్య(గైనకాలజిస్ట్), రమేష్(ఆర్థోపెడిక్), పీహెచ్‌సీ వైద్యుడు నజీర్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.ఆంజనేయులు, సూపర్‌వైజర్‌లు ఎ.పీటర్‌డేమియన్, జోస్పిన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీ తేజ, ఏఎన్ఎంలు అన్నామణి, శోభారాణి, రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి రోజారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే కులగణన

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి



పట్టణంలో కులగణను ప్రారంభించిన కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జానాభా ఆధారిత కులగణన చేపడుతోందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలో శుక్రవారం కుల జనగణనను ఆయన ప్రారంభించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కుల గణన చేయాలని వివిధ కుల సంఘాలు ఎప్పటి నుంచో ప్రభుత్వాలను కోరుతున్నాయన్నారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అన్యాయం జరగకుండా.. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో కుల గణనకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 28 వరకు జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కుల గణనకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను తెలియజేసి, సహకారం అందించాలన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 31 వార్డుల్లో 15 సచివాలయాలను కలిపి 309 క్లస్టర్లుగా విభజించామన్నారు. 19,319 కుటుంబాలు, 56,798 మంది జనాభా ఉన్నట్లు తెలిపారు. వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించి, యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ముందుగా సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు ఉన్నారు.

గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో..

మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్ కంటెపూడి, గుడిపూడి గ్రామాల్లో కుల గణను పరిశీలించారు. సర్వే అనంతరం వివిధ కారణాలతో మిగిలిపోయిన వారు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. కుల గణన ప్రక్రియ అత్యంత పారదర్శ కంగా వివరాలు నమోదు అనంతరం ఆ కుటుంబంలో ఎవరైనా ఒక వ్యక్తి నుంచి ఆధార్ తో కూడిన ఈ– కేవైసీ తీసుకుంటారన్నారు. ఈ ప్రక్రియలో బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తదితర విధానాలకు అవకాశం కల్పించారన్నారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక, విద్య, ఆర్థిక అభివృద్ధి, వారి ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవడం కోసం, అణగారిన వ్యక్తులు లేదా ఆ వృత్తులను అనుసరిస్తున్న వారి సమస్యలను తెరపైకి తీసుకురావడం కోసం కులగణన జరుగుతుందన్నారు. మండలంలో మొత్తం 19 గ్రామ సచివాలయాల పరిధిని 407 క్లస్టర్లుగా విభజించటం జరిగిందన్నారు. మొత్తం 26,024 కుటుంబాలకు గాను 72,675 మంది జనాభా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.దయాసాగర్, మండల విద్యాశాఖాధి కారి ఎ.శ్రీనివాసరావు, ఏపీఎం శిఖా కృపావేణి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు ఉన్నారు.

కలుషిత తాగునీటితో అస్వస్థత

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు బ్రహ్మనాయుడు కాలనీలో తాగునీరు కలుషితం అవుతుండడంతో కాలనీవాసులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. పలుచోట్ల వాటర్ పైపులు పగిలిపోయి అందులోకి మురుగునీరు చేరడంతో నీరు కలుషితమవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ విజయానాయక్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం రత్నం, ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, వైద్య సిబ్బంది సుబ్బారెడ్డి, రామ్మోహన్, ఆశ వర్కర్ రమణ కాలనీలో డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. ప్రస్తుతం ఒకరు జ్వరంతో ఉన్నట్లు మరో 8 మంది చర్మంపై మచ్చలు రావడం, కాళ్లు వాపునకు గురయ్యారని గుర్తించారు. వీరికి వైద్య సేవలు గతం నుంచే అందిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. పైపుల లైన్లు పగిలిపోయి నీరు కలుషితం అవుతోందని, నీటి నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపామని వివరించారు. పగిలిపోయిన పైపుల స్థానంలో కొత్తవి వేయడమే దీనికి పరిష్కారమన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించడంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అయితే ప్రత్యామ్నాయం లేకపోవడంతో కొందరు అదే కలుషిత నీటిని వాడుతుండడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తూనే ఉన్నాయన్నారు.

కులగణను పరిశీలించిన జేసీ శ్యాంప్రసాద్

దాచేపల్లి : కులగణన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. నగర పంచాయతీతో పాటుగా మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ దాచేపల్లిలో జరుగుతున్న కులగణను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జేసీ వెంట తహసీల్దారు జి.కరుణ కుమార్, కమిషనర్ సత్యనారాయణ తదితరులున్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జేసీ శ్యాంప్రసాద్ సమీక్ష జరిపారు. జగనన్న భూ రక్ష, భూ హక్కు పథకంపై అధికారులకు పలు సూచనలు చేశారు.

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి ఆలయంలో ఈ నెల 20 నుంచి 26 తేదీ వరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి శుక్రవారం తెలిపారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం, ఆలయ సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ధర్మప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ధర్మప్రచార ప్రవచనలు ఉంటాయని వివరించారు.